సాక్షి సిద్దిపేట

మంగళవారం, 28, ఫిబ్రవరి, 2023



వివాహ విందుకు వచ్చి.. 8లో..

వివాహ విందుకు బయలుదేరారు. కొద్ది నిమిషాలయితే గమ్యస్థానానికి చేరేవారు. ఇంతలోనే ఇద్దరు యువకులను రోడ్డు ప్రమాదం బలి తీసుకుంది.



సైన్స్‌పై పట్టు సాధించాలి 9లో..

విద్యార్థులు సైన్స్‌పై పట్టు సాధించాలని ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు లింగ శ్రీనివాస్ విద్యార్థులకు సూచించారు.



కుటుంబానికి రెండు చెత్తబుట్టలు

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా ప్రతీ కుటుంబానికి రెండు చెత్త బుట్టలు పంపిణీ చేసేలా హుస్నాబాద్ బల్దియా సర్వసభ్య సమావేశంలో నిర్ణయించారు. 9లో..

సమస్య మీది.. పరిష్కారం మాది

నేడు హుస్నాబాద్ మున్సిపల్ సమస్యలపై సాక్షి ఫోన్‌ఇన్

హుస్నాబాద్: పట్టణ పరిధిలో మీ ఇంటి చుట్టు కుక్కలు, కోతులు సంచరిస్తున్నాయా? తాగునీరు, వీధి లైట్లు, పారిశుద్ధ్యంలో లోపాలు ఉన్నాయా? అయితే మీ సమస్యను అధికారుల దృష్టికి తీసుకురండి ? పరిష్కారానికి మా వంతు కృషి చేస్తాం.





తేదీ : 28-02-2023

సమయం మధ్యాహ్నం 12 నుంచి 1 గంట వరకు

అధికారి: సుంకె రాజమల్లయ్య, హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్

ఫోన్ నంబర్లు: 9490977500, 9440945276

న్యూస్‌రీల్

సిద్దిపేట బల్దియా కమిషనర్ బదిలీ

నిర్మల్ కమిషనర్ సంపత్ రాక



సిద్దిపేటజోన్: సిద్దిపేట స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీ కమిషనర్ సీఎచ్. రవీందర్‌రెడ్డి బదిలీ అయ్యారు. గతేడాది హుజూరాబాద్ ఆర్డీఓగా పనిచేస్తున్న సమయంలో ఆయన సిద్దిపేట మున్సిపల్ కమిషనర్‌గా వచ్చిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయనను మళ్లీ రెవెన్యూ విభాగానికి బదిలీ చేశారు. ఆయన స్థానంలో నిర్మల్ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న అరిగెల సంపత్ బదిలీపై ఇక్కడకు రానున్నారు. ఈ మేరకు మున్సిపల్ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అరవింద్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. రెండు, మూడు రోజుల్లో సంపత్ విధుల్లో చేరనునట్లు సమాచారం.

దోలు కొడుతూ మల్లన్న సేవలో..



దోలు కొడుతున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

వర్గల్(గజ్వేల్): వర్గల్‌లో కొలువుదీరిన మల్లన్న స్వామి జాతర ఆధ్యాత్మిక అనుభూతులు పంచుతుంది. సోమవారం ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి సంబురాల్లో పాల్గొనిస్వామివారిని దర్శించుకుని డోలు కొట్టారు. ఆయనకు జెడ్పీటీసీ బాలూయాదవ్ అధ్వర్యంలో యాదవసంఘం ఘనస్వాగతం పలికింది. ఆయన వెంట ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

పునరావాస ప్యాకేజీ వెంటనే ఇవ్వాలి



ఆందోళన చేస్తున్న భూ నిర్వాసితులు

అక్కన్నపేట(హుస్నాబాద్): ప్రత్యేక పునరావాస ప్యాకేజీ కింద రూ.20 లక్షలు ఇవ్వాలని గౌరవెల్లి ప్రాజెక్ట్ భూ నిర్వాసితులు డిమాండ్ చేస్తున్నారు. అక్కన్నపేట మండలం గుడాటిపల్లి గ్రామం వద్ద దీక్షా శిబిరంలో నిర్వాసితులు చేస్తున్న ఆందోళన సోమవారం నాటికి ఆరో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాజెక్టు నిర్మాణ పనులకు ఎప్పుడు అడ్డుపడకున్నా.. పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వం నిర్వాసితుల గోడు వినరు.. గోస పట్టదా? అని ప్రశ్నిస్తున్నారు. నిర్వాసితులపై ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ కక్షసాధింపులు మానుకోవాలని ఈ సందర్భంగా వైఎస్సార్ తెలంగాణ పార్టీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ అయిలేని మల్లికార్జున్‌రెడ్డి అన్నారు. ఆయన నిర్వాసితుల ఆందోళనకు మద్దతు తెలిపారు. ఆయనతోపాటు సర్పంచ్ బద్దం రాజిరెడ్డి తదితరులు ఉన్నారు.

కంటికి వెలుగు

జిల్లాలో ముమ్మరంగా సాగుతున్న కార్యక్రమం

- 1.87 లక్షల మందికి పరీక్షలు పూర్తి
- దగ్గరి చూపు లోపం 40,144..
- దూరపు చూపు లోపం 30,994 మందికి గుర్తింపు



కంటి పరీక్ష చేస్తున్న డాక్టర్

సాక్షి, సిద్దిపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండో విడత 'కంటి వెలుగు' కార్యక్రమం జిల్లాలో ముమ్మరంగా సాగుతోంది. జనవరి 19న జిల్లా వ్యాప్తంగా ప్రారంభమైన వైద్య శిబిరాల్లో ఇప్పటి వరకు 1,87,710 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలు, 499 పంచాయతీల్లో షెడ్యూల్ ప్రకటించి 45 బృందాల ద్వారా పరీక్షలను నిర్వహిస్తున్నారు. మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక చొరవతో ఆటో డ్రైవర్లు, పోలీసులకు, న్యాయవాదులకు ఇలా ఆయా వర్గాలకు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు.

మున్సిపల్ చైర్మన్లు, కమిషనర్లు, కౌన్సిలర్లు, అధికారులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది సహకారంతో వైద్య ఆరోగ్య శాఖ 18 ఏళ్ల పైబడిన ప్రతీ ఒక్కరూ పరీక్షలు చేయించుకునేలా చర్యలు తీసుకుంటుంది. జూన్ చివరి వరకు ఈ కార్యక్రమం కొనసాగనుంది.

- జిల్లా వ్యాప్తంగా 18 సంవత్సరాలుపైబడిన వారు 7,91,588 ఉండగా 1,87,710 మంది పరీక్షలు చేయించుకున్నారు. అందులో మహిళలు 1,00,962 మంది, పురుషులు 86,742 మంది ఉన్నారు.
- ఇందులో 1,16,572 మందికి ఎలాంటి కంటి సమస్య లేదని నిర్ధారించగా.. 71,138 మందికి కంటి సమస్యలు ఉన్నట్లు తేల్చారు.
- రీడింగ్ అద్దాలు(దగ్గరి చూపు) మొత్తంగా 40,144 మందికి ఈ లోపం ఉన్నట్లు గుర్తించారు. అందులో 40 ఏళ్లలోపు 4,272 మంది, 40 ఏళ్లపై బడిన వారు 35,872 మంది ఉన్నారు.
- ఇప్పటివరకు జిల్లాలో 40,144 మందికి రీడింగ్ అద్దాలు పంపిణీ చేశారు. అలాగే ప్రిస్క్రిప్షన్ ద్వారా 30,994 మంది కోసం అద్దాలకు ఆర్డర్ పెట్టారు. అందులో 5,807 అద్దాలు జిల్లాకు రాగా.. 25,187 రావాల్సి ఉంది.

అందరి సహకారంతోనే..



ప్రజా ప్రతినిధులు, మున్సిపల్, పంచాయతీ శాఖ అధికారులు, సిబ్బంది సహకారంతో కంటి వెలుగు కార్యక్రమం విజయవంతంగా ముందుకు సాగుతోంది. ఈ కార్యక్రమం నిర్వహించే గ్రామం, కాలనీలో ముందుగానే ఆశలు, పంచాయతీ సిబ్బందితో ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పిస్తున్నాం. శిబిరాల దగ్గర ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం.

–డాక్టర్ కాశీనాథ్, డీఎంహెచ్‌ఓ



ప్రణాళికను పరిశీలిస్తున్న రవీందర్‌రెడ్డి

కొత్త కాలనీలకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ

సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి

సిద్దిపేటజోన్: సిద్దిపేట మున్సిపాలిటీ పరిధిలోని ఆయా వార్డుల్లో కొత్తగా ఏర్పడి యూజీడీ సౌకర్యం లేని ప్రాంతాల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వసతి కల్పించనునట్టు మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన కొత్తగా ఏర్పడిన కాలనీలను ఎన్‌స్పీఈ సంస్థ ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. అమత్, టీయూఎఫ్ఐడీసీ పథకం కింద అదనంగా యూజీడీ పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఈ మేరకు సర్వే ప్రక్రియ పూర్తి చేసి, డీపీఆర్ సిద్ధం చేయాలని సూచించారు. అంతకుముందు కోమటిచెరువు నెక్లెస్ రోడ్డు మిగులు పనులను పరిశీలించారు. వాటిని వెంటనే పూర్తి చేయాలని సూచించారు. అనంతరం స్వచ్ఛబడిని సందర్శించారు. ఈ సందర్భంగా తడిచెత్తతో తయారు చేసిన సేంద్రియ ఎరువును కొనుగోలు చేసిన మధుసూదన్‌రెడ్డిని ఆయన అభినందించారు. ఎరువుల తయారీ యూనిట్, గోశాల, డిజిటల్ తరగతి గది, తదితర ప్రాంతాలను సైతం పరిశీలించారు. ఆయన వెంట అధికారులు శ్రీనివాస్ రెడ్డి, మహేష్, సతీష్, రంజిత్, వనిత కౌన్సిలర్ దీప్తి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రూ.30 కోట్లతో బెజ్జంకి అభివృద్ధి

మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



మాట్లాడుతున్న రసమయి బాలకిషన్

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి మండలంలో రూ.30 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతుంటే వాటిని విస్మరించి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్ ప్రజలను రెచ్చగొట్టేలా చూస్తున్నారని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆరోపించారు. మండలంలోని బేగంపేటలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు సహకారంతో రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా నిధులను తెచ్చి 90 శాతం ఇప్పటికే పనులు పూర్తి చేశామన్నారు. అధికారంలోకి వచ్చాక బెజ్జంకి మండలాన్ని కరీంనగర్ జిల్లాకు మార్చుతామని చెప్పిన ఎంపీ కేంద్రంలో వాళ్ల ప్రభుత్వమే ఉన్నందున మొదట 7 గ్రామాలను భద్రాచలంలో ఎందుకు కలుపడంలేదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి చేపడుతున్న పథకాలను చూసి తమకు మద్దతు లభించదని ఇలాంటి రెచ్చగొట్టే మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. సమావేశంలో ఎంపీపీ లింగాల నిర్మల, జెడ్పీటీసీ కనగండ్ల కవిత, ఏఎంసీ చైర్మన్ కచ్చు రాజయ్య బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, అయిల పాపయ్య, లక్ష్మణ్, శేఖర్‌బాబు, బొనగిరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్

సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ప్రజావాణికి 54 దరఖాస్తులు
- స్వీకరించిన అదనపు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్



అర్జీ పత్రాన్ని చూపుతున్న శిరీష, భర్త

సిద్దిపేటరూరల్: సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అధికారులు దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ సూచించారు. సోమవారం కలెక్టరేట్ సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్‌ఓలక్ష్మీకిరణ్‌తో కలిసి ప్రజల నుంచి అర్జీలు, ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ముజామ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ ప్రతీ అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు. అధికారులు వారంలోపు అర్జీలకు సంబంధించిన నివేదిక ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా సంబంధిత, డబుల్‌బెడ్రూం ఇళ్లు, ఆసరా పెన్షన్లు వీటిపైనే అధికంగా ఫిర్యాదులు వచ్చాయి. మొత్తం జిల్లా వ్యాప్తంగా 54 అర్జీలు వచ్చాయి.

సౌకర్యాలు కల్పించాలి....

నా పేరు భూకల శిరీష. మాది సీఎం దత్తత గ్రామం నరసన్నపేట. మా గ్రామంలో కొద్ది రోజుల క్రితం పాత ఇళ్లను తొలగించి వాటి స్థానంలో కొత్త ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ఈ క్రమంలో సర్పంచ్ మాధ విరాజిరెడ్డి మా ఇళ్లను కుల్చివేసి, ఖాళీ స్థలాన్ని తీసుకున్నారు. అనంతరం ఇల్లు నిర్మించి ఇచ్చారు. కాని విద్యుత్ సౌకర్యం, మిషన్ భగీరథ నల్ల కనెక్షన్, మరుగుదొడ్లు నిర్మాణం చేయలేదు. ఈవిషయంపై సర్పంచ్‌ను సౌకర్యాలు అడిగితే తనకు రూ.లక్షాయాభై వేలు ఇస్తేనే సౌకర్యాలు కల్పిస్తానన్నాడు. నా భర్త డీసీఎం నడుపుతూ, రోజు వారీగా కూలీ పనులు చేసుకుంటూ ఇద్దరు ఆడపిల్లలను పోచించుకుంటున్నాం. మాకు సౌకర్యాలు కల్పించాల్సిన సర్పంచ్ డబ్బులు అడగడం ఎంత వరకు సమంజసం. వెంటనే సర్పంచ్‌పై చర్యలు తీసుకుని, మిగతా సౌకర్యాలు కల్పించాలి.

కరాటే టోర్నమెంట్‌లో విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులతో భాగ్యరాజ్

సిద్దిపేటఎడ్యుకేషన్: రాష్ట్రస్థాయి 8వ కరాటే టోర్నమెంట్‌లో సిద్దిపేట విద్యార్థులు మెడల్స్ సాధించినట్లు జపాన్ కరాటే అసోసియేషన్ సిద్దిపేట జోనల్ చీఫ్ భాగ్యరాజ్ చెప్పారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఆదివారం నకిరేకల్‌లో అసోసియేషన్ రాష్ట్ర చీఫ్ రాపోలు సుదర్శన్ సమక్షంలో నిర్వహించిన పోటీల్లో 35 మంది సిద్దిపేట చిన్నారులు పాల్గొన్నారన్నారు. కుమిత్తే, కటాస్ విభాగాల్లో 16 గోల్డ్, 15 సిల్వర్, 11 కాపర్ మెడల్స్ సాధించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని 15 జిల్లాల నుంచి సుమారు 700ల మంది విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో మన విద్యార్థులు 42 పతకాలు సాధించి సర్టిఫికెట్లు పొందడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థుల తల్లి దండ్రులు క్రీడలతో పాటు కరాటేను ప్రోత్సహించాలని కోరారు. క్రీడలతో చిన్నారుల్లో శారీరక ఎదుగుదల, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయన్నారు. కార్యక్రమంలో కారటే శిక్షకులు తేజస్విన్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రీతి మృతికి సంతాపంగా కొవ్వొత్తుల ప్రదర్శన



హుస్నాబాద్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న వివిధ సంఘాల నాయకులు

హుస్నాబాద్: పట్టణంలో సోమవారం రాత్రి డాక్టర్ ప్రీతి మృతికి సంతాపకంగా గిరిజన, బీసీ, ఎస్సీ, సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. అంబేడ్కర్ చౌరస్తా నుంచి మల్లె చెట్టు చౌరస్తా వరకు ఈ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ చౌరస్తాలో ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రీతి మృతికి కారకుడైన మహ్మద్ సైఫ్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అలాగే ఆమె కుటుంబాన్ని అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకుడు శివరాజ్, కిషన్ నాయక్, సంపత్ నాయక్ బీసీ సంఘాల నాయకులు పచ్చిమట్ల రవీందర్‌గౌడ్, కొయ్యడ కొమురయ్య, వల్లపు రాజు, బీఎస్పీ నాయకుడు శంకర్, మాడిశెట్టి శ్రీధర్ తదితరలు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మనే అభివృద్ధి నిరోధకుడు

అసమ్మతి కౌన్సిలర్ల తీవ్ర ఆరోపణ



ఆర్డీఓకు ఫిర్యాదు చేస్తున్న అసమ్మతి కౌన్సిలర్లు

గజ్వేల్: గజ్వేల్ – ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ అభివృద్ధికి చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి అడ్డంకిగా మారాడని అసమ్మతి కౌన్సిలర్లు మరోసారి ధ్వజమెత్తారు. పట్టణంలోని ఇందిరాపార్కు చౌరస్తా వద్ద అభివృద్ధిని కావాలనే అడ్డుకుంటున్నాడని, కోటమైసమ్మ విస్తరణ పనులు నత్తడకన సాగడానికి కూడా చైర్మన్ వైఖరే కారణమని ఆరోపిస్తూ గజ్వేల్ ఆర్డీఓ విజయేందర్‌రెడ్డికి సోమవారం ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు రజిత, శ్యామల, షహనాజ్, విద్యారాణి, అత్తెల్లి శ్రీనివాస్, బాలేష్, కురాకుల శ్రీనివాస్ తదితరులు మాట్లాడుతూ నియోజకవర్గానికి ప్రాతినిథ్యం వహిస్తున్న సీఎం కేసీఆర్ పట్టణాభివృద్ధికి విరివిగా నిధులిస్తున్నా.. చైర్మన్ తీరు అడ్డంకిగా మారిందన్నారు. ప్రత్యేకించి ఇందిరా పార్కు చౌరస్తా వద్ద జంక్షన్ నిర్మాణానికి నిధులు సిద్ధంగా ఉన్నా విస్తరణలో తన సొంత భవనాలు కోల్పోతాననే భావనతో చైర్మన్ ఈ పనులను పట్టించుకోవడం లేదన్నారు. అదేవిధంగా కోటమైసమ్మ రోడ్డు విస్తరణ నత్తనడకన సాగడం ప్రజలకు ఇబ్బందికరంగా మారిందని తెలిపారు. ఇళ్లు కోల్పోయిన వారిలో ఇంకా కొందరికీ పరిహారం మాటేమోగానీ డబుల్ బెడ్రూమ్ సైతం ఇవ్వలేదని ఆరోపించారు. ఈ అంశంలో చైర్మన్ చొరవ సక్రమంగా లేదన్నారు. పది రోజుల్లో ఈ సమస్యలను కొలిక్కి తీసుకురాకపోతే చైర్మన్ తీరుకు నిరసనగా కోటమైసమ్మ గుడి వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు.

కబ్జా భూముల సర్వేకు జిల్లా యంత్రాంగం సిద్ధం

కోహెడ(హుస్నాబాద్): కోహెడలోని సర్వే నంబర్ 768 బాడుగుల చెరువు శిఖం 47.30 ఎకరాలు, సర్వే నంబర్ 1,229లోని 6.30 ఎకరాలు, సర్వే నంబర్ 1,227లోని 2.10 ఎకరాలు కబ్జాకు గురైన ప్రభుత్వ భూమి సర్వే నిర్వహించుటకు జిల్లా యాంత్రంగం సిద్ధమైనట్లు సమాచారం. జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి జిల్లా కేంద్రం నుంచి ఏడీ అధికార సిబ్బందిని కోహెడకు పంపించేందుకు ఆదేశించినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ నేపథ్యంలో సర్వే ద్వారా హద్దు రాళ్లు ఏర్పాటు చేసేవరకు భనవ నిర్మాణాలను నిలిపివేయాలని తహశీల్దార్ నిర్మాణదారులను ఆదేశించినట్లు తెలిసింది.

భళా.. బాటిల్ బోట్

- మున్సిపల్ కార్మికుల వినూత్న ఆలోచన
- ఖాళీ ప్లాస్టిక్ బాటిళ్లతో పడవ తయారీ
- హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువులో ట్రయల్ రన్ విజయవంతం



ఖాళీ బాటిళ్లతో తయారు చేసిన బోటును ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత



నీటిలో పరుగులు తీస్తున్న వాటర్‌బాటిళ్ల బోటు

హుస్నాబాద్: మున్సిపల్ కార్మికుల ఆలోచనలు.. వినూత్న ఆవిష్కరణకు బాటలు వేశాయి. ఖాళీ బాటిళ్లతో పడవను తయారు చేసి ఔరా అనిపించారు. ఖాళీ ప్లాస్టిక్ బాటిళ్లలో తయారు చేసిన బోటును సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత చేతుల మీదుగా ప్రారంభించి ఎల్లమ్మ చెరువులో విజయవంతంగా ట్రయల్ రన్ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలో పని చేస్తున్న ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ రవికుమార్‌తో పాటు కార్మికుడు పైస శ్రీకాంత్ ఇద్దరు వేస్ట్ ఇన్నొవేషన్ కాన్సెప్ట్‌తో సరికొత్తగా ఏదైన ప్రాజెక్టు చేయాలని ఆలోచన చేశారు. చెక్కతో కాకుండా రెండు లీటర్ల ఖాళీ కూల్ డ్రింక్ బాటిళ్లతో బోటు తయారు చేయాలని నిర్ణయించుకున్నారు. మొత్తం 190 బాటిళ్లను సేకరించి బోటు ఆకారంగా అమర్చారు. సపోర్టుగా కింది భాగంలో చెక్క ముక్కలను బిగించారు. బాటిళ్ల మూతలు తెరుచుకోకుండా అతికించారు. బోటు ఆకారం వచ్చిన తర్వాత పట్టణానికి చెందిన వడ్రంగి చంద్రయ్య సాయంతో బాటిళ్ల కదలకుండా దారంతో అల్లారు. బోటు 250 కిలోల బరువు వరకు మోస్తుంది. ఇద్దరు వ్యక్తులు ప్రయాణం చేసే వీలుగా దీన్ని తయారు చేశారు. ఈ ఇద్దరూ విధులు నిర్వహిస్తూనే 15 నుంచి 20 రోజుల్లో బోటును తయారు చేసి శభాష్ అనిపించుకున్నారు. ముందుగా ఎల్లమ్మ చెరువులో చెక్కతో తయారు చేసిన తెడ్డు సహాయంతో బోటు ప్రయాణం చేశారు. అది విజయవంతం అయింది. అనంతరం బోటు స్పీడ్ పెంచాలని వన్ హెచ్‌పీ మోటార్‌ను బిగించి హ్యాండిల్ సహాయంతో ప్రయాణాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్య, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్లు పున్న లావణ్య, చిత్తారి పద్మ, పెరుక భాగ్యరెడ్డి, వల్లపు రాజు, కొంకట నళినిదేవి, హరీశ్, బొజురమ, కోమటి స్వర్ణలత, శ్రీనివాస్ యాదవ్, వేణు యాదవ్, శంకర్‌రెడ్డి, అయాబ్ పాల్గొన్నారు.

సరికొత్త ప్రయోగాలు చేస్తాం



చెత్తతో ఏదో చేయాలని వినూత్నంగా ఆలోచించాం. మా ఆలోచనల్లో పుట్టిందే ఈ ఖాళీ బాటిళ్ల బోటు. మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్, పాలకవర్గ సభ్యుల ప్రోత్సాహంతో ఈ బోటు తయారీని విజయవంతం చేశాం. చెత్తను వృథా చేయకుండా ప్రజలకు ఉపయోగపడే మరికొన్ని ప్రాజెక్టులను తయారు చేస్తాం. ముస్ముందు ఎక్కువ మంది ప్రయాణించే బోటును తయారు చేయాలనే ఆలోచనలో ఉన్నాం.

–రవికుమార్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్

క్లుప్తంగా

మూసివేసిన పరిశ్రమలో మంటలు



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

మనోహరాబాద్(తూప్రాన్): మూసివేసిన ఓ పరిశ్రమలో మంటలు చెలరేగాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ముప్పిరెడ్డిపల్లి శివారులోని బీఎస్ స్టీల్ పరిశ్రమ ఆవరణలో సోమవారం మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు ఫైర్ ఇంజిన్ వారికి ఫోన్ చేశారు. నర్సాపూర్ నుంచి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది రెండుగంటల పాటు శ్రమించి మంటలను ఆర్పేసింది.

జేసీబీ దహనం



కల్హేర్(నారాయణఖేడ్): గుర్తు తెలియని వ్యక్తులు జేసీబీని దహనం చేశారు. ఈ ఘటన సిర్గాపూర్ మండల పరిధిలోని గరిడెగాంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గుండప్ప ఉపాధి నిమిత్తం జేసీబీ తీసుకొచ్చి స్థానికంగా పనిచేయిస్తున్నాడు. ఆదివారం రాత్రి గ్రామ పంచాయతీ వద్ద ఉంచాడు. గుర్తు తెలియని వారు నిప్పు పెట్టడంతో జేసీబీ పూర్తిగా కాలిపోయింది. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ నారాయణ తెలిపారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట న్యాయమూర్తి సోమవారం జరిమానా విధించారు. సిద్దిపేట పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీఓ కార్యాలయ చౌరస్తా, రాజీవ్ రహదారిపై మూడు రోజుల క్రితం సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తమ సిబ్బందితో నిర్వహించిన తనిఖీల్లో వాహనదారులను బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించగా, 13 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ చేసిన న్యాయమూర్తి రమేష్‌బాబు వారికి రూ.28,500 జరిమానా విధించారు.

ఏడుపాయలలో గుర్తు తెలియని మహిళ మృతదేహం

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల్లో గుర్తు తెలియని మహిళ మృతదేహం సోమవారం వెలుగు చూసిందని పాపన్నపేట ఎస్ఐ విజయ్ తెలిపారు. ఏడుపాయలలోని మంజీర పాయ తీరాన 50 నుంచి 55 ఏళ్ల వయసు ఉన్న మహిళ మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో ఉందన్నారు. ఆరెంజ్ రంగు చీర, ముదురు నీలంరంగు జాకెట్ ధరించి ఉందన్నారు. శరీరంపై ఎలాంటి గాయాలు లేవని, జాతరకు వచ్చి అనారోగ్యంతో మృతి చెంది ఉండవచ్చన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని, ఆనవాళ్లు తెలిసినవారు 9440627014 నంబరులో సంప్రదించాలన్నారు.

వ్యక్తి అదృశ్యం

ఏడు నెలల క్రితమే ప్రేమ వివాహం

పటాన్‌చెరు టౌన్: బయటకు వెళ్లి వస్తానని చెప్పిన వ్యక్తి కనిపించకుండాపోయాడు. అమీన్‌పూర్ ఎస్ఐ సోమేశ్వరి కథనం ప్రకారం...మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం హమీద్‌నగర్‌కు చెందిన ప్రణయ్‌కుమార్‌రెడ్డి, సాయిలత ప్రేమవివాహం చేసుకున్నారు. ఏడునెలల క్రితం ఉపాధి నిమిత్తం అమీన్‌పూర్ మున్సిపాలిటీలోని భవానీపురం కాలనీకి వచ్చారు. ఈ నెల 22వ తేదీ రాత్రి పదిగంటలకు బయటకు వెళుతున్నా అని చెప్పాడు. రాత్రయినా తిరిగి రాలేదు. భర్త కోసం భార్య సాయిలత తెలిసినవారి వద్ద, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. ఐదురోజులు దాటినా జాడ తెలియకపోవడంతో సోమవారం ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ప్రణయ్ కుమార్‌రెడ్డి(ఫైల్)

వివాహ విందుకు వచ్చి..

బైక్ అదుపు తప్పి ఇద్దరు యువకుల దుర్మరణం
- హవేళిఘణాపూర్ మండలం చౌట్లపల్లి వద్ద ఘటన
- మృతులు కామారెడ్డి జిల్లావాసులు



సంఘటన స్థలంలో యువకుల మృతదేహాలు

మెదక్ రూరల్: వివాహ విందుకు బయలుదేరారు. కొద్ది నిమిషాలయితే గమ్యస్థానానికి చేరేవారు. ఇంతలోనే మృత్యువు ఎదురువచ్చిందేమో..ఇద్దరు యువకులను రోడ్డు ప్రమాదం రూపంలో బలి తీసుకుంది. కామారెడ్డి జిల్లా లింగంపేట మండలం సజ్జన్‌పల్లికి చెందిన పోచయ్య(24), విజయ్(25) ఆదివారం రాత్రి హవేళిఘణాపూర్ మండలం చౌట్లపల్లి గ్రామంలో జరిగే ఓ వివాహ విందుకని బయలుదేరారు. చౌట్లపల్లి శివారుకు చేరగానే రాత్రి సమయం కావడంతో చీకట్లో బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టి పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే చనిపోయారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతులను కామారెడ్డి జిల్లావాసులుగా గుర్తించారు. పంచనామా నిర్వహించి, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మృతుల కుటుంబీకులు ఆస్పత్రి వద్దకు చేరుకొని కన్నీరుమున్నీరయ్యారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇద్దరూ బంధువులే

లింగంపేట(ఎల్లారెడ్డి): సజ్జన్‌పల్లికి చెందిన విజయ్, పోచయ్యలు ఒకే కుటుంబానికి చెందినవారు. వరుసకు చిన్నాన్న, పెద్దనాన్న కుమారులు అవుతారు. స్వగ్రామంలో శుక్రవారం బంధువుల ఇంట్లో పెళ్లి జరిగింది. చౌట్లపల్లిలో ఆదివారం రిసెప్షన్ ఉంది. బంధువులంతా రిసెప్షన్‌కు డీసీఎంలో బయలుదేరారు. ఈ ఇద్దరు మాత్రం బైక్‌పై వస్తామని చెప్పారు. బంధువులంతా భోజనాలు చేస్తున్న క్రమంలో ఇద్దరికీ ఫోన్ చేయగా, ఎవరూ ఫోన్ లిఫ్ట్ చేయలేదు. వారి నుంచి ఏ సమాధానం అందలేదు. దీంతో బంధువులంతా ఆందోళన చెందగా, ఇంతలోనే పిడుగులాంటి వార్త అందింది. రోడ్డు ప్రమాదంలో ఇద్దరూ చనిపోయారని, బంధువుల హుటాహుటిన సంఘటనాస్థలానికి చేరుకున్నారు.

విజయ్ కూలీనాలీ చేస్తూ తల్లిదండ్రులు పోచయ్య–రుక్కవ్వ, నానమ్మ పర్వవ్వను పోషిస్తున్నాడు. రెక్కాడితేగానీ డొక్కాడని కుటుంబం వారిది. కొన్నేళ్లుగా పోచయ్య రెండు కాళ్లు పడిపోయి మంచానికే పరిమితం అయ్యాడు. పర్వవ్వ కూడా కొద్ది రోజుల క్రితం కింద పడింది. దీంతో ఆమెది కూడా నడవలేని పరిస్థితి. ఉన్న ఎకరం భూమి సాగుచేసుకుంటూ కుటుంబానికి అండగా ఉన్నాడు. 26 ఏళ్లకే నిండు నూరేళ్లు నిండాయంటూ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న తీరు అందరినీ కలిచి వేసింది. పోచయ్య–రుక్కవ్వ దంపతులు సంతానం లేకపోవడంతో ఏడాదిలోపు వయసు ఉన్నప్పుడే విజయ్‌కు దత్తత తీసుకున్నారు. అల్లారుముద్దుగా పెంచి పెద్దచేశారు. రెండేళ్ల క్రితమే మహేశ్వరితో వివాహం జరిపించారు. వీరికి ఏడాదిలోపు కూతురు ఉంది.



విజయ్ (ఫైల్)

సజ్జన్‌పల్లి గ్రామానికి చెందిన సాయిలు– మైసవ్వ దంపతులకు ఇద్దరు కొడుకులు సాయిలు పెద్దవాడు కాగా, పోచయ్య చిన్న కొడుకు. వ్యవసాయం చేస్తూ కూలిపనులకు వెళ్లే వాడు. పెళ్లికి ఎదిగిన కొడుకు తమకు అన్నివిధాలా ఆసరాగా ఉంటాడని ఆ తల్లిదండ్రులు భావించారు.కానీ ఇంతలోనే దూరమయ్యాడు.



పోచయ్య (ఫైల్)

దుబ్బాక కౌన్సిలర్ ఇంట్లో చోరీ

దుబ్బాకటౌన్ మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డు కౌన్సిలర్ స్వప్న రాజిరెడ్డి ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఎస్ఐ మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం... కౌన్సిలర్ స్వప్నరాజిరెడ్డి దుబ్బాకలోని గాంధీ విగ్రహం సమీపంలోని ఇంట్లో కొద్ది నెలలుగా కిరాయికి ఉంటోంది. ఈ క్రమంలోనే ఆదివారం ఇంటికి తాళం వేసి బంధువుల ఊరికి వెళ్లింది. అదే అదునుగా భావించి గుర్తుతెలియని దుండగులు ఇంటి గొళ్లెం తొలగించి లోపలకు చొరబడి తులంన్నర బంగారుఆభరణాలు, 8 తులాల వెండి పట్టీలు ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం ఊరు నుంచి ఇంటికి వచ్చేసరికి తాళం తీసింది. ఆందోళనకు లోనై ఇంట్లోకి వెళ్లి చూడగా బంగారం, వెండి వస్తువులు కనిపించలేదు. దీంతో వెంటనే కౌన్సిలర్ స్వప్న భర్త రాజిరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్లూస్‌టీంతో ఆధారాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.



ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

అంతరసాగుగా గంజాయి

పోలీసుల దాడి..235 మొక్కలు స్వాధీనం



రాయికోడ్(అందోల్): అంతరసాగుగా పెంచుతున్న గంజాయి మొక్కలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తహసీల్దార్ ప్రభులు, ఎస్ఐ ఏడుకొండలు తెలిపిన వివరాల ప్రకారం..మండల పరిధిలోని సింగితం గ్రామానికి చెందిన రాములు గ్రామశివారులో తనకున్న 30 గుంటల భూమిలో కుసుమ సాగు చేశాడు. అందులో అంతరసాగుగా గంజాయి మొక్కలు పెంచుతున్నట్టు సమాచారం రావడంతో దాడి చేసి 235 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నామన్నారు. తహసీల్దార్ సమక్షంలో ఆర్ఐ ప్రభాకర్ పంచనామా నిర్వహించారు. సంఘటనపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. జహీరాబాద్ రూరల్ సీఐ వెంకటేశం సంఘటనాస్థలాన్ని, గంజాయి మొక్కలను పరిశీలించారు.



అంజయ్య మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ శివకుమార్

చేపల వేటకు వెళ్లి...

నర్సాపూర్ రూరల్: చేపల వేటకు వెళ్లి ఓ వ్యక్తి శవమై తేలాడు. నర్సాపూర్ ఎస్ఐ శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలపరిధిలోని ఇబ్రహీంబాద్ గ్రామానికి చెందిన పదంగళ్ల అంజయ్య(45) ఆదివారం సాయంత్రం పెద్దచెరువుకు వేటకు వెళ్లాడు. రాత్రి పదయినా ఇంటికి రాలేదు. ఆందోళనతో కుటుంబసభ్యులు, గ్రామస్తులు చెరువు వద్ద వెతికారు. అయినా ఆచూకీ లభించలేదు. సోమవారం ఉదయం అంజయ్య మృతదేహం చెరువులో తేలి కనిపించింది. అంజయ్య భార్య శేకమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. చేపలవేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందినట్టు ఎస్ఐ తెలిపారు.

అప్పుల బాధతో...

పటాన్‌చెరు టౌన్: అప్పులబాధతో ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. భానూర్–బీడీఎల్ ఎస్ఐ మహేశ్వర్ రెడ్డి కథనం ప్రకారం..రామచంద్రాపురం పరిధిలోని ఈదులనాగులపల్లికి చెందిన మల్లేష్(38) పెయింటర్‌గా పని చేస్తున్నాడు. దుబారా ఖర్చుల కారణంగా అప్పులు అయ్యాయి. 26వ తేదీన పనిఉందని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తిరిగిరాకపోవడంతో కుటుంబసభ్యులు అతడి కోసం గాలించారు. గ్రామ శివారులోని తెల్లగుట్ట వద్ద వేపచెట్టుకు వేలాడుతూ మల్లేష్ మృతదేహం కనిపించింది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులతో కలిసి సంఘటనస్థలానికి వెళ్లారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య సింధూజ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాల కిటికీలు ధ్వంసం

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని నందగోకుల్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ని తరగతి గదుల కిటికీలు, తలుపులు ధ్వంసం చేశారని హెచ్ఎం దీప చెప్పారు. మద్యం సేవి ంచాక ఈ ఘటనకు పాల్పడ్డారని ఆమె సోమ వారం పోలీసులకు సమాచారం ఇచ్చారు.

కోఆప్షన్ సభ్యురాలిగా హర్షత్‌జమ

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి కోఆప్షన్ సభ్యురాలిగా హర్షత్‌జమ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కోఆప్షన్ సభ్యుడుగా ఉన్న తాజోద్దీన్ ఇటీవల మృతి చెందడతో సోమవారం ఎన్నిక నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ స్వప్న పర్యవేక్షణలో కోఆప్షన్ సభ్యుడి ఎన్నిక జరిగింది. మండలంలోని మాడ్గికి చెందిన హర్షత్‌జమ ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఆమె ఏకగ్రీవంగా ఎన్నికైంది.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

చేగుంట(తూప్రాన్): అనుమానస్పద స్థితిలో ఒకరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని పోతాన్‌శెట్టిపల్లికి చెందిన దానొల్ల మహేష్(36) అదే గ్రామానికి చెందిన నవనీతను ప్రేమ వివాహం చేసుకున్నాడు. మహేష్ అనంతసాగర్ సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవలకాలంలో మహేష్ తరచు మద్యం సేవిస్తూ భార్యతో గొడవపడేవాడు. ఆదివారంరాత్రి కూడా ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో నవనీత తన తల్లిగారింటికి వెళ్లింది. అదేరాత్రి మహేష్ కూడా అక్కడికే వెళ్లి పడుకున్నాడు. సోమవారం ఉదయం చూసేసరికి మహేష్ కిందపడిపోయి కనిపించాడు. వెంటనే తూప్రాన్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మహేష్ మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి తండ్రి నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మహేష్ మృతదేహం

గుంతలో మహిళ మృతదేహం

అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు

కొల్చారం(నర్సాపూర్): అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ మృతదేహం గుంతలో లభ్యమైంది. కొల్చారం ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. కౌడిపల్లి మండలం ముంద్రాయి గ్రామానికి చెందిన గొల్ల ప్రమీల (45) ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చెప్పకుండా వెళ్లింది. సోమవారం కొల్చారం మండల పరిధిలోని రాంపూర్‌కు చెందిన రైతులు అటవీప్రాంత సమీపంలోని తమ పొలాలకు వద్దకు వెళ్లగా, అక్కడ గుంతలో ఓ మహిళ మృతదేహం తేలి ఉండడాన్ని గమనించారు. ఒంటిపై జాకెట్, లోదుస్తులు మాత్రమే ఉన్నాయి. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు సంఘటనస్థలానికి వచ్చి చూడగా, కొద్దిదూరంలో మృతురాలు ధరించిన చీర కనిపించింది. గుంతలో నుంచి ప్రమీల మృతదేహాన్ని బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా మృతురాలి భర్త లక్ష్మయ్య పదేళ్ల క్రితమే చనిపోయాడు. ఆమెకు పెళ్లయిన కూతురు, కుమారుడు ఉన్నాడు. బంధువుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశారు. అంతకుముందు ఘటన స్థలానికి మెదక్ ఎస్పీ రోహిణి వచ్చారు. పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయాలని ఎస్ఐని ఆదేశించారు.



గుంతలో ప్రమీల మృతదేహం

కోదాడకని వెళ్లి.. కొండపోచమ్మసాగర్‌లో శవమై

- పచ్చబొట్టు ఆధారంగా వివరాల సేకరణ
- హత్య కేసుగా నమోదు

ములుగు(గజ్వేల్): కొండపోచమ్మసాగర్‌లో ఓ మృతదేహం తేలియాడుతూ కనిపించింది. స్థానికులు పోలీసులు సమాచారం ఇచ్చారు. సంఘటనస్థలానికి వచ్చిన వారు మృతుడి కుడి చేయికున్న పచ్చబొట్టు ఆధారంగా వివరాలు సేకరించారు. మృతుడు సంగారెడ్డి జిల్లా కంది మండలం ఇంద్రకరణ్ గ్రామానికి చెందిన చాకలి మధు(26)గా గుర్తించారు. గజ్వేల్ రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, ములుగు ఎస్ఐ రంగ కృష్ణలు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంద్రకరణ్ గ్రామానికి చెందిన మధు ఐదు రోజుల క్రితం కోదాడకు వెళుతున్నానని ఇంట్లో చెప్పి బయలుదేరాడు. ఏం జరిగిందో ఏమో తెలియదుగానీ సోమవారం కొండపోచమ్మసాగర్‌లో తేలియాడుతున్న మధు మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి కాళ్లు, మెడకు వైరు కట్టారు. ఆవైరుకు బండరాయి కట్టి ఉండడం చూస్తే..మధును ఎవరో చంపి నీటితో పడేసినట్టుగా అనుమానం వస్తుందన్నారు. హత్యకేసుగా నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని చెప్పారు. కాగా సంఘటనస్థలాన్ని గజ్వేల్ ఏసీపీ రమేష్ కూడా పరిశీలించారు.



మధు (ఫైల్)

రామలింగేశ్వరస్వామి ఆలయంలో చోరీ

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని చండూరు శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో దొంగతనం జరిగింది. ఆలయ సేవకుడు నాగయ్య తెలిపిన వివరాల ప్రకారం..సోమవారం ఉదయం ఆలయాన్ని శుభ్రం చేస్తుండగా, ఆలయానికి ఉండే మరో ద్వారం తాళం కిందపడి ఉంది. అనుమానంతో గర్భగుడిలోకి వెళ్లి చూడగా, వెండి నాగపడిగలు, మకరతోరణం కనిపించలేదు. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా రథోత్సవం నిర్వహించిన అనంతరం స్వామివారి వెండి వస్తువులు గుడిలోనే ఉంచారు. ఉత్సవాల తర్వాత గుడిని తెరవలేదు. సోమవారం భక్తుల తాకిడి ఉంటుందని, ఆలయం శుభ్రం చేయడానికి వస్తే స్వామి వారి వెండి వస్తువులు దొంగతనానికి గురయ్యాయన్నారు. విషయం పోలీసులకు చెప్పగా, ఏఎస్ఐ మిస్బావుద్దీన్ తన సిబ్బందితో వచ్చి ఆలయ పరిసరాలను పరిశీలించారు. క్లూస్ టీంను పిలిపించి వివరాలు సేకరించారు.



ఆలయంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

కుక్కల దాడిలో గొర్రెలు మృతి

జిన్నారం(పటాన్‌చెరు): కొట్టంలో ఉన్న గొర్రెల గుంపుపై ఒక్కసారిగా వీధికుక్కలు దాడి చేశాయి. ఈ ఘటనలో 11 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. వివరాలు ఇలా ఉన్నాయి. గుమ్మడిదల మండలం కానుకుంటకు చెందిన ఆగ మల్లయ్య వంద గొర్రెలు ఉన్నాయి. రోజూలాగే సాయంత్రం కాగానే వాటిని కొట్టంలోకి తోలాడు. సోమవారం తెల్లవారుజామున పది వీధికుక్కలు అందులోకి చొరబడి దాడి చేశాయి. 11 గొర్రెలు తీవ్రంగా గాయపడి మృతి చెందాయి. వాటి విలువ రూ.70 వేలు ఉంటుంది. ఈ విషయం తెలుసుకున్న పశు సంవర్ధకశాఖ అధికారి అరుణ ఘటనాస్థలానికి చేరుకున్నారు. ఉన్నతాధికారులకు నివేదించి రైతుకు న్యాయం జరిగేలా చూస్తానన్నారు. గుమ్మడిదల ఎంపీపీ ప్రవీణ, జెడ్పీటీసీ సభ్యుడు కుమార్‌గౌడ్, నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, హుస్సేన్ తదితరులు రైతును పరామర్శించారు.



కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెలు

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కంది(సంగారెడ్డి): ట్రాక్టర్, టీవీఎస్ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరు గాయపడ్డారు. రూరల్ ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి కథనం ప్రకారం.. ఇస్నాపూర్‌కు చెందిన మేదరి కృష్ణ(37) తన బంధువైన సింగితం గ్రామానికి చెందిన మేదరి కిష్టయ్యతో కలిసి టీవీఎస్‌పై ఆదివారం రాత్రి బ్యాతోల్ మీదుగా ఇస్మాయిల్‌ఖాన్‌పేటకు వెళుతున్నాడు. ఈ క్రమంలో బ్యాతోల్ కమాన్ సమీపంలో ఎదురుగా ఇసుకలోడుతో వస్తున్న ఓ ట్రాక్టర్ టీవీఎస్‌ను ఢీకొట్టింది. దీంతో కృష్ణ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కిష్టయ్యకు గాయాలయ్యాయి. మృతుడి భార్య నాగమణి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మేదరి కృష్ణ (ఫైల్)

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఝరాసంగం(జహీరాబాద్): చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ రాజేందర్ రెడ్డి చెప్పిన కథనం ప్రకారం...మండల పరిధిలోని చీలమామిడి గ్రామానికి చెందిన సంగన్న(38) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 24వ తేదీన పెద్దాపూర్‌లోని బంధువుల ఇంటికి బైక్‌పై బయలుదేరాడు. గ్రామశివారులో అడవిపంది అతివేగంగా వచ్చి బైక్‌కు తగిలింది. దీంతో సంగన్న కింద పడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో జహీరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి భార్య నరసమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

అటవీ అధికారుల ఆకస్మిక తనిఖీ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని టింబర్ డిపో, సామిల్లులో జిల్లా అటవీ శాఖ అధికారి ఆదేశాల మేరకు సంగారెడ్డి అటవీ శాఖ రేంజర్ వీరేంద్రబాబు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని సాయిరాం సామిల్లులో మిషన్లకు సంబంధించిన లైసెన్స్ రెన్యూవల్ చేసుకోకపోవడంతో వాటిని సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టింబర్ డిపోలు, సామిల్ తప్పనిసరిగా లైసెన్సులు తీసుకోవాలన్నారు. నిబంధనలకు అనుగుణంగా కలప ఉండాలని, అంతకు మించి కలప ఉంటే చర్యలు తప్పవన్నారు. ఈ తనిఖీలో డిప్యూటీ రేంజ్ అధికారిణి షహీన్, వేణుగోపాల్, మంజిత్ సింగ్, గంగాభవాని, సంతోషి, నిజాముద్దీన్, బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆశ్రమ ఏర్పాటు ఇక్కడి ప్రజల అదృష్టం

శ్రీ కృష్ణానందజీ మహరాజ్‌ను దర్శించుకున్న సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్ రూరల్: సిద్ధయోగి శ్రీ కృష్ణానందజీ మహరాజ్‌ను రాష్ట్ర మహిళాకమిషన్ చైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి దర్శించుకున్నారు. చిప్పల్‌తుర్తిలో సద్గురుధామ ఆశ్రమంలో మూడు రోజుల ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఆమె ఆశ్రమానికి వచ్చారు. ఈ సందర్భంగా సునీతా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రజలు ఆధ్యాత్మిక చింతనతో ఆనందంగా గడపాలన్నారు. కబీర్‌సేన రాష్ట్ర అధ్యక్షుడు చత్రునాయక్ ఆధ్వర్యంలో ఆశ్రమం ఏర్పాటు చేయడం ఇక్కడి ప్రజల అదృష్టమన్నారు. ఈ కార్యక్రమంలో చిప్పల్‌తుర్తి, జక్కపల్లి గ్రామాల సర్పంచ్‌లు శ్యామల లక్ష్మణ్ గౌడ్, వెంకటలక్ష్మి, శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు శేఖర్, సత్యం గౌడ్ తదితరులు పాల్గొన్నారు,



శ్రీ కృష్ణానందజీ మహరాజ్ ఆశీర్వాదం తీసుకుంటున్న సునీతాలక్ష్మారెడ్డి

చెన్నకేశవరెడ్డిని గెలిపించాలి

కొండాపూర్(సంగారెడ్డి): హైదారాబాద్–రంగారెడ్డి–మహబూబ్‌నగర్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పీఆర్‌టీయూ బలపరిచిన గుర్రం చెన్నకేశవరెడ్డిని గెలిపించాలని కోరుతూ సోమవారం ఆ యూనియన్ నేతలు సంగారెడ్డి, సదాశివపేట, మునిపల్లి మండలాల్లో పర్యటించారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సంగారెడ్డికి వచ్చిన పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్ రావు, నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్ గౌడ్‌లు వివిధ కళాశాలలు, ప్రభుత్వ పాఠశాలలు సందర్శించారు. చెన్న కేశవరెడ్డిని గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమలాకర్ రావు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఎలాంటి సమస్యలు ఉన్న పరిష్కరించేది కేవలం పీఆర్‌టీయూనేనని, 30 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్‌సీని ప్రకటింప చేశామని, బదిలీలు, పదోన్నతుల షెడ్యూలు విడుదల కాకపోతే ఓట్లు అడగమని చెప్పిన దమ్మున్న సంఘం పీఆర్‌టీయూ మాత్రమేనని తెలిపారు. గుర్రం చెన్నకేశవరెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపించాలని కోరారు ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి మదన్‌గోపాల్, సంగారెడ్డి మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రామకష్టారెడ్డి శ్రీనివాస్, సంగారెడ్డి అర్బన్ అధ్యక్షుడు వెంకటకృష్ణ, సదాశివపేట అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రవణ్ కుమార్, ప్రవీణ్, సదాశివపేట అర్బన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విరాట్ స్వరూప్, తుకారాం జిల్లా, మండల, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



చెన్నకేశవరెడ్డిని గెలిపించాలని ప్రచారం నిర్వహిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES
■ వ్యక్తిగత, వ్యాపారం, వ్యవసాయ ఆస్తి, టేకోవర్ లోన్, NPA కేసులు తక్కువ సిబిల్ స్కోర్ కూడా ఋణానికి వర్తిస్తాయి. సంప్ర: 94630 26237 [T-P1751]

WANTED
■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15 వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-781890]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరం ఇవ్వాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.